సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 27-1-2025

సంపుటి: 20 సంచిక: 258

పేజీలు: 4 వెల: రూ.1



## కల్వర్టులు పునరుద్ధరించండి

**గ్రీవెన్స్‌లో వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ ఫిర్యాదు**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సంతవురిటి జంక్షన్ నుంచి విజయరాంపురం వైపు కొత్తగా వేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణంలో సంతవురిటి గ్రామం దాటిన తర్వాత రెండు కల్వర్టులు పూర్తిగా పాడైపోయాయని, వాటిని పునరుద్ధరించి విజయరాంపురం వరకు రోడ్డు వేయాలని వైకాపా జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే పొందూరు నుంచి రాజాం వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు వెంటనే ఆర్ అండ్ బీ ఏఈతో మాట్లాడి రెండు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ పూర్తిచేయాలని సూచించారు.

# ధాన్యం కొనడానికి 'గింజ'కుంటున్నారు

- 20 మండలాల్లో నిలిచిపోయిన సేకరణ
- లక్ష్యం పూర్తయిందంటున్న అధికారులు
- ట్రాక్‌షీట్ సాంకేతికత మీద నెపం
- ప్రతీ గింజా కొంటామన్న మంత్రి
- దళారులకు తక్కువ ధరకే అమ్మేస్తున్న రైతులు



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లాలో ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు పూర్తయినట్టు అధికారులు ప్రకటిస్తే రైతులు మాత్రం మద్దతు ధర దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. లక్ష్యం పూర్తయినట్టు చూపిస్తున్నా రైతుసేవా కేంద్రాల్లో ఆ తర్వాత కొనుగోలు కోసం రైతులు తీసుకువచ్చే ధాన్యానికి ట్రాక్‌షీట్లు జనరేట్ కావడం లేదు. దీన్ని ప్రభుత్వం, అధికారులు సాంకేతిక సమస్యగానే చూస్తున్నారు. దీంతో రైతులకు కొత్త సమస్య ఎదుర్కొంటున్నారు. లక్ష్యం పూర్తికాని మండలాలకు పక్కన ఉన్న మండలాల నుంచి కొనుగోలు చేసే ధాన్యానికి ట్రాక్‌షీట్లు సర్దుబాటు చేస్తే ఆ మండలంలో కొనుగోలు పూర్తిగా నిలిచిపోతుంది. దీనివల్ల రైతులతో పాటు మిల్లర్లు తలలు పట్టుకుంటున్నారు. ఈకేవైసీ చేసిన వంద శాతంను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉన్నా కేవలం 70 శాతం ధాన్యం మాత్రమే సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో ఇది సమస్యగా మారి రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకొనే పరిస్థితి వచ్చింది.

**కొనుగోలు నిలిపేశారు**

చివరి ధాన్యం గింజ వరకూ కొంటామని ప్రభుత్వం ప్రకటించినా, లక్ష్యం పూర్తయిపోయిందని చెప్పి జిల్లాలో 20 మండలాల్లో కొనుగోలు నిలిపేశారు. ధాన్యం కొనుగోలుకు లక్ష్యమంటూ లేదని, ఎంతైనా కొంటామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఖరీఫ్ పంట చేతికి వచ్చే సమయంలో ప్రకటించారు. కానీ సంక్రాంతి నాటికి లక్ష్యమైపోయిందంటూ చేతులేత్తేశారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో జిల్లాలో 20 మండలాల్లో ధాన్యం కొనుగోలు ఆపేయడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికీ కొన్ని మండలాల్లో వరి కుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. జిల్లాలో 2024-25 ఖరీఫ్ సీజన్లో 8.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. వీటిలో తిండి గింజలకు 80 వేలు మెట్రిక్ టన్నులు మినహాయించగా మార్కెట్‌కు 7.62 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లోకి రావచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. వీటిలో 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కొనుగోలుకు ముందు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లాలో రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై సమీక్ష తర్వాత లక్ష్యంలో ఏ మార్పు కనిపించలేదు. అధికారులు మొదట ఏది నిర్ణయించారో, ఆ మేరకే ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసి సేకరణ మొదలుపెట్టారు. 30 మండలాల్లో 630 రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేసి 266 మిల్లులకు సీఎంఆర్ విధానంలో సరఫరా చేయాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. జిల్లా లక్ష్యానికి అనుగుణంగా ఆయా మండలాలకు లక్ష్యాలను నిర్దేశించారు. నేటికి 30 మండలాల్లో 4.20 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ పూర్తయిందని కేవలం 70వేల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేస్తే లక్ష్యం పూర్తయినట్టేనని అధికారులు ప్రకటించారు. ఇందులో శ్రీకాకుళం, గార, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పలాస, మెళియాపుట్టి, జి.సిగడాం, సంతబొమ్మాళి, టెక్కలి, బూర్జ, కోటబొమ్మాళి, నందిగాం, ఎల్ఎన్ పేట, కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, పోలాకి తదితర మండలాల్లో కొనుగోలు నిలిపేశారు. మరో 10 మండలాల్లో మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందని పౌర సరఫరాల సంస్థ అధికారులు లెక్కలు చూపిస్తున్నారు.

**ప్రతి ఏటా ఇదే పరిస్థితి**

ధాన్యం కొనుగోలు కోసం ఏటా రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఏటా ఇదే సమస్య తలెత్తుతున్నా దాని పరిష్కారంపై ప్రభుత్వమూ దృష్టి సారించడం లేదు. గత సంవత్సరం రైతుల దగ్గర ధాన్యం నిల్వలు ఉంటుండగానే కొనుగోలు ఆపేశారు. మిల్లర్లు అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కలవడంతో ఆయన పౌర సరఫరాల సంస్థ అధికారులకు ఫోన్ చేసి అదనంగా ధాన్యం కొనాలని రికమెండ్ చేశారు. మరోవైపు రైతుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో ప్రభుత్వం తొలి విడతలో కొంత, ఆ తర్వాత మరికొంత కొనుగోలు చేసింది. ఇప్పుడు అదే పరిస్థితి కనిపిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల నిర్ణయం వెలువడడం లేదు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి కొనుగోలు అంశాన్ని రైతు సంఘాల నాయకులు, మిల్లర్లు తీసుకువెళ్లినట్టు తెలిసింది. అయినా ఇప్పటికీ పరిష్కారం దొరకలేదని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలులో సాంకేతిక సమస్యలు పరిష్కరించడానికి మాత్రమే మంత్రి చర్యలు తీసుకున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం 2024-25 ఖరీఫ్‌కు సాధారణ రకం 100 కేజీలకు రూ.2,300, ఎ-గ్రేడ్ రకం రూ.2,320గా ప్రకటించింది. ధాన్యం సేకరణ పూర్తయినట్టు చూపించి కొనుగోలు నిలిపేసిన తర్వాత దళారులు రంగంలోకి దిగి మద్దతు ధరపై రూ.100 నుంచి రూ.200 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.



**దళారులు తరలించుకుపోతున్నారు**

రైతుల నుంచి సేకరించే 80 కేజీల ధాన్యం బస్తాకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం రూ.1,840 చెల్లించాల్సి ఉంటుంది. అయితే దళారులు మాత్రం సాధారణ రకం, గ్రేడ్ రకంతో సంబంధం లేకుండా 80 కేజీల బస్తాను రూ.1650 నుంచి రూ.1740 కొనుగోలుచేసి తరలించుకుపోతున్నారని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు నిలిపేయడంతో రైతులు మద్దతు ధర కోల్పోయి దళారుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పంట దిగిబడి మేరకు ధాన్యం సేకరణ లక్ష్యం పెంచి రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, జి.సిగడాం, గార, పోలాకి తదితర మండలాల్లో ఆలస్యంగా ఉబాలు వేయడం వల్ల డిసెంబరు చివరి వారంలో పంట చేతికొచ్చి పొలాల్లోనే కుప్పలుపెట్టారు. ఆయా మండలాల రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కొంతమంది ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ కొనుగోలు చేసినా ధాన్యాన్ని తమ మండలాలకు సర్దుబాటు చేయొద్దంటూ మరోవైపు కొందరు ఎమ్మెల్యేలు అధికారులకు చెప్తున్నారు. లక్ష్యం పూర్తయిందనే పేరుతో ఆపేసిన మండలాల్లో రైతుల వద్ద ఎంతమేర ధాన్యం నిల్వలు ఉన్నాయో, ఆ మేరకు కొనుగోలు చేయాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతుంది. దీనిపై - మిగతా 4లో



# మహాప్రస్థానానికి 75 ఏళ్లు

**'నేనొక దుర్గం! నాదొక స్వర్గం!**
**అనర్గళం, అనితరసాధ్యం నా మార్గం'**

'1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నాను. తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు ఈ శతాబ్దం నాది' అంటూ తన అక్షర ప్రభావ ప్రస్థానపు ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు శ్రీశ్రీ. ప్రపంచం ఆర్థికమాంద్యంతో తల్లడిల్లి ఆకలితో అలమటిస్తున్న 1930-40 మధ్యకాలంలో సామాన్యుల వ్యథలను నవీనత్వంతో వ్యక్తపరుస్తూ, సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టేలా రాసిన శ్రీశ్రీ మహాప్రస్థానం గేయాలు 1950లో పుస్తకరూపం ధరించింది. ఆ పుస్తక ప్రభ, అందులోని కవిత్వపు శోభ 75 వసంతాలైన ఇంకా నేటి ఆధునిక ప్రపంచానికి రిలవెంట్‌గానే వుంది. నేటికీ శ్రీశ్రీ పేరు మీద ఎన్నో సామాజిక, సాహిత్య స్వచ్ఛంద సంస్థలు నవసమాజ నిర్మాణం కోసం అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తూ ఉండటమే అందుకు తార్కాణం. మహాప్రస్థానంలోని గేయాలు నేటి కృత్రిమ మేధతో కూడిన ఇంగ్లీష్ మీడియం బోధన యుగంలో కూడా నేటి యువతరం నాలుకలపై అద్భుతంగా పలుకుతున్నాయి. కవిత్వం రాస్తున్న ప్రారంభ దశలో ఏ కవినైనా.. నువ్వేమన్నా శ్రీశ్రీ అనుకుంటున్నావా అని ఎవరైనా అంటే ముసిముసి నవ్వులు చిందిస్తూ పొంగిపోనివారు ఎవరుంటారు చెప్పండి ఇప్పటికీ.. ఎప్పటికీ..! అలాంటి మహా ప్రవాహం కోసం పదండి ముందుకు మహాప్రస్థానం గేయాలను ఓసారి స్మరించుకుందాం..!

*'కళ్ళంటూ ఉంటే చూసి,*
*వాక్కుంటే వ్రాసీ!*
*ప్రపంచమొక*
*పద్మవ్యూహం!*
*కవిత్వమొక తీరని*
*దాహం!"*

ప్రపంచ వ్యాప్తంగా వచన కవిత్వం ఎలా రాయాలనే దానికి విభిన్న అభిప్రాయాలు ఉన్నా ఇలానే రాయాలనే నిబంధన ఏమీలేదు. గురజాడ అడుగుజాడలతో ఆరంభమైన సామాన్యుని భాషలోనే కవిత్వం శ్రీశ్రీతో విశ్వవ్యాప్తమైంది. పాండిత్యంతో సంబంధం లేకుండా సామాజిక సమస్యలపై స్పందించే ప్రతి సగటు మనిషికి కవిత్వం రాసే ప్రేరణ లభించింది.

*'ఇక్కడ నిలబడి నిన్ను*
*ఇవాళ ఆవాహనం చేస్తున్నాను!*
*అందుకో ఈ చాచిన హస్తం!*
*ఆవేశించు నాలో!*
*ఇలా చూడు నీకోసం*
*ఇదే నా మహాప్రస్థానం!'* అంటూ

శ్రీశ్రీ తన మిత్రుడు కొంపెల్ల జనార్ధనరావుపై రాసిన **'తలవంచుకు వెళిపోయావా నేస్తం!'** అంకితం గేయంతో మనల్ని అడుగులు వేయిస్తుంది.. మహా ప్రస్థానం!

నేటి స్వాతంత్ర్య భారతావనిలో కూడా స్వాతంత్ర్యం రాకముందే రాసిన మహాప్రస్థానం గేయాలు సమాజంలో సజీవమై ఇంకా అక్కడక్కడా అప్పుడప్పుడు కనిపిస్తూనే వున్నాయి. కన్నీటి సాక్షిగా కదిలిస్తూనే వున్నాయి. పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, వివక్షత, దౌర్జన్యం, అసమానతలు వంటి ప్రాపంచిక సమస్యలు మనకు నాగరిక ప్రజాస్వామ్య లౌకిక సమాజంలో కూడా తారసపడుతూనే వున్నాయి.




*'ఒక వ్యక్తిని*
*మరొక్క వ్యక్తీ,*
*ఒక జాతిని*
*వేరొక జాతీ,*
*పీడించే*
*సాంఘిక ధర్మం*
*ఇంకానా?*
*ఇకపై సాగదు'*

*'కూటి కోసం, కూలీ కోసం*
*పట్టణంలో బ్రతుకుదామని*
*తల్లిమాటలు చెవిని పెట్టక*
*బయలుదేరిన బాటసారికి..*
*ఎంత కష్టం..!*
*..ఆ అవ్వే మరణిస్తే*
*ఆ పాపం ఎవ్వరి'* దని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది!

*'అంతేలే, పేదల గుండెలు!*
*అశ్రువులే నిండిన కుండలు!*
*శ్మశానమున శశికాంతులలో*
*చలిబారిన వెలి రాబందలు!'*

విశ్వాంతరాళంలో మనస్థాయి ఎంత? అంటూ అంతరిక్ష సరిహద్దులను దాటి ఆలోచిస్తున్న నేటి ఆధునిక మానవుని గురించి..

*'ఆలోచనలు పోయేవాడా!*
*అనునిత్యం అన్వేషించేవాడా!*
*చెట్టూ, చెరువూ, గట్టూ, పుట్టా*
*ఆకసంలో, సముద్రంలో*
*అన్వేషించేవాడా!'* అని ఆనాడే మన భవిష్యత్తును రాసారు.

*'పొలాల నన్నీ, హలాల దున్నీ,*
*ఇలా తలంలో హేమం పిండగ..*
*జగానికంతా సౌఖ్యం నిండగ..*
*నాలో కదలే నవ్య కవిత్వం*
*కార్మికలోకపు కల్యాణానికి,*
*శ్రామికలోకపు సౌభాగ్యానికి*
*సమర్పణంగా, సమర్చనంగా..'*

అంటూ సాగిన శ్రీశ్రీ ప్రతిజ్ఞ నేటి శ్రామిక, కార్మిక, కర్షక లోకానికి నిలువెత్తు నిదర్శనం.

*'మాకు గోడలు లేవు*
*గోడలను పగులగొట్టడమే మా పని..*
*అలజడి మా జీవితం..*
*ఆందోళన మా ఊపిరి..*
*తిరుగుబాటు మా వేదాంతం..'*

అంటూ తన ధిక్కార స్వరాన్ని శాస్త్రీయ సాహిత్య ప్రపంచం వైపు విప్లవ కాంతులతో మళ్లించాడు.

గెలుపోటములను పట్టించుకోకుండా, ప్రయత్నాలు ఆపకుండా జీవన గమనం వుండాలని సమాజం ఎప్పుడూ సాపేక్షమే అని

*'నిప్పులు చిమ్ముకుంటూ*
*నింగికి నే నెగిరిపోతే*
*నిబిడాశ్చర్యంతో వీరు*
*నెత్తురు క్రక్కుకుంటూ*
*నేలకు నే రాలిపోతే,*
*నిర్దాక్షిణ్యంగా వీరె..'* అంటూ

వివరించారు.

*'నే నేదో విరచిస్తానని,*
*నా రచనలలో లోకం ప్రతిఫలించి*
*నా తపస్సు ఫలించి,*
*నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ*
*నా జాతి జనులు పాడుకునే*
*మంత్రంగా మ్రోగించాలని.."*

నేటికీ ప్రపంచ భాషలలో ఎక్కడా కూడా 'కవితా! ఓ కవితా!' వంటి అద్భుతమైన కవిత్వం రాలేదని మహాకవులు సైతం శ్రీశ్రీని అభినందించారు. బహుశా నోబెల్ బహుమతి స్థాయి సాహిత్యం ఇది.

*'మెరుపు మెరిస్తే, వాన కురిస్తే,*
*ఆకసమున హరివిల్లు విరిస్తే*
*అవి మీకె అని ఆనందించే*
*కూనల్లారా!'*

.. అంటూ రాసిన శైశవ గీతి పిల్లలకు ఇవ్వాల్సిన స్వేచ్ఛ ప్రపంచపు విలువను తెలియజేస్తుంది. ఒత్తిడి లేని విద్యను పిల్లలకు సూచిస్తుంది.

ఇక చివరగా ఈ లోకం మీదేనండి! ఈ రాజ్యం మీరేలండి! అంటూ జగన్నాథుని రథచక్రాలు మనల్ని ముందుకు తీసుకెళ్తాయి. ప్రఖ్యాత సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాతీయ పురస్కారం అందించిన ఠాగూర్ సినిమాలోని పాట పల్లవిలో కూడా **'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను!'** అంటూ శ్రీశ్రీ మహాప్రస్థానం మనకు కనిపిస్తుంది. భీమ్లా నాయక్ సినిమా షూటింగ్ సందర్భంలో నేటి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌లు శ్రీశ్రీ చేతిరాతతో కూడిన మహాప్రస్థానం సంచికను ఆవిష్కరించారు. మహాప్రస్థానం లాంటి కొన్ని పుస్తకాలు కొన్ని శతాబ్దాల పాటు కాలాన్ని నడిపిస్తూ భవిష్యత్తు తరాలకు మార్గదర్శనం చేస్తుంటాయి. మానవత్వపు రహదారిపై మనల్ని నడిపిస్తుంటాయి. ఏదేమైనా ఈ శతాబ్దపు సాహితీ ప్రయాణంలో శ్రీశ్రీ మహాప్రస్థానం ఓ ధృవతార అనడంలో అతిశయోక్తి ఏమీలేదు.

*'శ్రీశ్రీ పుస్తకం కొని తీరికగా చదవండి, పద్యం పదిసార్లు చదవండి. ఏమి అర్థం కాలేదా.. ఏ యువకుడికో, భిక్షుకుడిగో, డెత్ బెడ్ ప్రజంట్‌గా పంపండి. పారెయ్యకండి. అంతకన్నా దాచుకోకండి. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వ శక్తి మీ చేతులలో పుస్తకం, పాస్ ఇట్ ఆన్'* అంటూ చెలం దాదాపు 85 సంవత్సరాల క్రిందటే చెప్పారు..!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**93947 49536** (ది వైర్ కోసం...)

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా..



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బీజేపీ పని చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నేతలు పేర్కొన్నారు. పీఎన్ కాలనీలో బీజేపీ మండల అధ్యక్షులు చింతాడ భూషణరావు ఆధ్వర్యంలో సోమవారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ (రాజ్యాంగ సమ్మాన్) కార్యక్రమం జరిగింది. తొలుత నిర్వహించిన సమావేశంలో భారతమాత, అంబేద్కర్ చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ గొప్పతనాన్ని, రాజ్యాంగం విశిష్టతను వివరించారు. అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కి రాజ్యాంగానికి కాంగ్రెస్ పార్టీ తూట్లు పొడిచిందని విమర్శించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి స్థానిక ముచ్చవానిపేట వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, బూరగాపు లక్ష్మణరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి సాంబమూర్తి, చౌదరి ధనలక్ష్మి, బగాది కృష్ణారావు, పైడి సత్యం, బొత్స నాగబాబు, చిగిలిపల్లి రామ్మూర్తి, సనపల జగన్నాథం, సనపల నాయుడు, కూన హరి, సీపాన అప్పలనాయుడు, గొల్లపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

## రూపాయీ రూపాయీ ఎందుకు పడిపోతున్నావ్?

'రూపాయి విలువ పడిపోతోంది'.. పడిపోవడం ఏమిటి? రూపాయి నిన్న, ఇవాళ, రేపు.. రూపాయే కదా? చాలామందికి ఇదే సందేహం. అమెరికాలో కార్చిచ్చు, మహాకుంభమేళాలో మోనాలిసా, హైదరాబాదులో కుక్కర్ హత్య.. వీటన్నింటికంటే ముందుగానే 'రూపాయి క్షీణత' దేశంలో ప్రకంపనలు రేపుతూ ఉంది. కానీ చాలామంది దీని గురించి మాట్లాడుకోవడం లేదు. మన దేశం ఆర్థికంగా చాలా గొప్పగా ఎదిగిపోతోందన్న నమ్మకం ఉన్నవారైతే అసలు పట్టించుకోవడం లేదు. ఈ క్షీణతకు అప్పటి నెహ్రూయే కారణమని అన్నా అనేవాళ్లున్నారేమో? అసలు 'రూపాయి విలువ పడిపోవడం' అంటే ఏమిటి? ఏ దేశపు కరెన్సీ అయినా ప్రపంచవ్యాప్తంగా ఉండే డిమాండ్‌ను బట్టి దాని విలువ ఉంటుంది. అమెరికా అగ్రరాజ్యం కాబట్టి ఆ దేశపు కరెన్సీతోనే మనం పోలిక చూసుకోవాలి. ఏడాది క్రితం రూ.80 ఇస్తే ఒక డాలర్ వచ్చేది. ఇప్పుడు రూ.85 ఇస్తే ఒక డాలర్ వస్తుంది. అంటే డాలర్ విలువ రూ.5 పెరిగింది. మన కరెన్సీ విలువ రూ.5 పడిపోయింది. డాలర్ విలువ ఎందుకు పెరుగుతోంది? దానికి అనేక కారణాలు. అమెరికా వడ్డీ రేట్లు పెంచడం, బాండ్ రేట్లు పెరగడం లాంటివి. 'సరే.. డాలర్ విలువ పెరిగితే మనకేంటి నష్టం?' అని అనుకుందామా? అనుకోలేం. ఎందుకంటే వ్యాపారాలు, దిగుమతులు, దౌత్య సంబంధాలు, ఉన్నత విద్య, వీసాలు తదితర అనేక విషయాల్లో మనకు అమెరికాతో నిత్య లావాదేవీలు జరుగుతుంటాయి. మనం అమెరికా వస్తువులను దిగుమతి చేసుకుంటే ఆ దేశానికి డాలర్లలోనే చెల్లింపులు చేయాలి. అంటే గతేడాది ఒక డాలర్‌కి రూ.80 ఇచ్చేచోట, ఈసారి రూ.85 ఇవ్వాలి. అలా కొన్ని కోట్ల సొమ్ము అదనంగా అమెరికాకు వెళ్లిపోతుంది. దీనికితోడు అమెరికాకు వెళ్లే విద్యార్థులకు డాలర్లు కావాలంటే గతంలో కంటే ఎక్కువ సొమ్ము అవసరమవుతుంది. డాలర్లలో అప్పులు తెచ్చుకునే భారత కంపెనీలు సైతం చాలా పెద్ద మొత్తంలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి ఇంకా ఉన్నాయి. దీనివల్ల మన సొమ్ములో చాలాభాగం అగ్రరాజ్యానికి తరలిపోతుంది. ఇదంతా ఎందుకు? అమెరికాకు చెల్లింపులు చేయడం ఆపేస్తే? మంచిదే. కానీ అలా ఆపాలంటే దిగుమతులు ఆపాలి. మనం ఆపగలమా? ప్రధానంగా ఆటోమొబైల్ రంగం దిగుమతుల మీదే ఆధారపడి ఉంది. దిగుమతులు ఆపేస్తే ఆ రంగంపై కోలుకోలేని దెబ్బ పడుతుంది. పోనీ అమెరికాను వదిలేసి మరో దేశం నుంచి దిగుమతి చేసుకుందామా? అదీ కుదరదు. మిగిలిన దేశాలు కూడా 'మాకు డాలర్లలోనే చెల్లింపులు చేయండి' అనే కండీషన్ పెడితే చచ్చినట్లు డాలర్లలోనే చెల్లింపులు జరపాలి. అలా జరపాలంటే డాలర్లు కొనాల్సిందే. మన సొమ్మును అమెరికాకు తరలించాల్సిందే! మన దేశం పోయినేడాది పెట్రోల్, డీజిల్ వంటి వాటిపై రూ.11 లక్షల కోట్ల సొమ్ము విదేశాలకు పంపింది. ఇప్పుడు డాలర్ విలువ పెరిగింది కాబట్టి అది ఇంకెంత పెరుగుతుందో ఆలోచించండి. సరే.. ఇదంతా ప్రభుత్వం పని. మాకేమీ నష్టం లేదులే అని అనుకుంటే ద్రవ్యోల్బణంలో కాలేసినట్టే. ఎప్పుడైతే రూపాయి విలువ తగ్గి, మన దగ్గరున్న నిల్వలు ఇతర దేశాలకు తరలిపోతాయో, వెంటనే మన దగ్గర వస్తువులకు రేటు పెరుగుతుంది. రెండింతలైనా ఆశ్చర్యం లేదు. రేట్లతో పాటు పన్నుల పోటు మరింత పెరుగుతుంది. దీనికి తోడు మనదేశంలో పెట్టుబడి పెట్టిన విదేశీయులు చకచకా తమ పెట్టుబడులు వెనక్కి తీసుకుంటారు. అంటే వాళ్లకు కూడా డాలర్లే ఇవ్వాలి. దీంతో స్టాక్‌మార్కెట్‌పై భారీ దెబ్బ పడుతుంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో కలిపి సుమారు రూ.1.5 లక్షల కోట్ల సొమ్మును వెనక్కి తీసుకున్నారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. రూపాయి విలువ పడిపోవడం వల్ల అన్నీ నష్టాలేనా, లాభాలు లేవా అని అడిగితే ఉన్నాయి. ఏ దేశానికైనా ఎగుమతులే లాభమనే విషయం మనకు తెలుసు. ఆ లెక్కన మన దేశం నుంచి రకరకాల వస్తువులను విదేశాలకు ఎగుమతి చేసేవారు లాభం పొందుతారు. అలాగే అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఇండియాకు డబ్బు పంపేవారు కూడా లాభపడుతున్నారు. ఒకప్పుడు వారి డాలర్ రూ.80 మాత్రమే. అయితే ఇప్పుడు రూ.85 అయ్యింది. దీంతో ఆదాయం అమాంతం పెరిగింది. ఇక్కడి నుంచి విదేశీ కంపెనీలకు పనిచేసి, జీతం పొందేవారికి కూడా లాభమే. ఇదీ పడిపోతున్న రూపాయి కథ. రూపాయి విలువ పడిపోవడం వల్ల కొందరికి లాభాలున్నా సరే, దీర్ఘకాలంలో ఇది దేశానికి చాలా పెద్ద ముప్పు అని నిపుణులు అంటున్నారు. పరిస్థితి ఇలా కొనసాగితే నిత్యావసరాల ధరలు జనానికి అందుబాటులో లేకుండా పోతాయంటున్నారు. బ్యాంకులు కూడా తమ వడ్డీ రేట్లు పెంచడం, లోన్లకు పరిమితి విధించడం వంటివి చేసే అవకాశం ఉంటుందంటున్నారు. విదేశీ పెట్టుబడులను తెచ్చుకోవడం, ఎగుమతులు పెంచుకోవడం, క్రూడాయిల్ దిగుమతుల్ని తగ్గించుకోవడం వంటివి సత్వరం చేస్తే ఆర్థిక వ్యవస్థ కొంత గాడిన పడుతుందని సూచిస్తున్నారు.

## అనగనగా ఓ జానకి..!!



కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా కౌప్ పట్టణం సమీపంలో మల్లర్ అనే ఊరుంది. ఆ ఊరిలో జానకి పూజారి ఉండేవారు. ఆమె వయసు 90 ఏళ్లు. పెళ్లి కాక ముందు నుంచి రఫీఖ్ అబ్దుల్ ఖాదర్ కుటుంబంతో ఆమెకు సాన్నిహిత్యం ఉంది. భర్త పోయిన నాటి నుంచి ఆమె వారితోనే కలిసి ఉంటోంది. వారు ముంబయి వెళ్తే ముంబయి వెళ్లింది. అక్కడి నుంచి ఉడిపి వస్తే తనూ వచ్చేసింది. వారినే తన కుటుంబంలా భావించి జీవించింది. తన ఒక్కగానొక్క కొడుకు శేఖర్ విట్టల్ సైతం ఆ ఇంట్లో వారి మధ్యే పెరిగాడు, పెద్దవాడయ్యాడు. బంధువులతో ఆమె కలిసింది లేదు. ఆమె కోసం వారు వచ్చింది లేదు. కొడుక్కి పెళ్లి జరిగింది. అతనెక్కడో దూరంగా ఉద్యోగం చేసుకుంటూ భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. అయినా ఆమెకు దిగులు లేదు. అబ్దుల్ ఖాదర్ కుటుంబంతోనే ఆమె సావాసం. వారికి ఆమే పెద్ద దిక్కు. ఆమెను బంధువనో, బయటి మనిషో అని అనుకోవడం వారికి నచ్చదు. తమ ఇంటి మనిషే అని భావిస్తారు. అన్నింటిలో ఆమెకే ప్రాధాన్యం ఇస్తారు. రఫీఖ్ చుట్టాలు సైతం ఆమెను ఆ ఇంటి మనిషిలాగే భావించి గౌరవిస్తారు.

గత మంగళవారం జానకి కన్నుమూశారు. ఆమె కోరిక ప్రకారం అన్ని పనులూ అబ్దుల్ రఫీఖ్ కుటుంబసభ్యులే చేశారు. దూరాన ఉన్న కొడుకును పిలిపించి, అతని చేత హిందూ మత పద్ధతి ప్రకారం కర్మకాండలు జరిపించారు. ముస్లిం కుటుంబం ముందుండి జరిపించిన ఆ కార్యక్రమం గురించి గొప్పగా చెప్పుకుంటూ ఊరివారితోపాటు కౌప్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కూడా హాజరయ్యారు. ఆ రెండు కుటుంబాల మైత్రిని వారంతా పొగిడారు. జానకి 13 రోజుల కార్యక్రమాలు సైతం తమ ఇంటిలోనే జరగాలని రఫీఖ్ కుటుంబసభ్యులు అంటున్నారు.

"మతములన్నియు మాసిపోవును..
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"
- గురజాడ అప్పారావు

- విశీ(వి.సాయివంశీ)

## రోగాలు సోకుతున్నాయి క్లీన్ చేయండి



(సత్యంన్యూస్, టెక్కలి)

స్థానిక గందరగోళం వీధి దుర్గంధం వెదజల్లుతూ అనారోగ్యాలకు కారణమవుతుందని టెక్కలివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలో గత ఆరునెలలుగా డ్రైనేజ్‌లో ఉన్న మురుగు తొలగించడం లేదని, దీంతో చెత్త, మురికి పేరుకుపోయి సీసీరోడ్డు పై నుండి వరదలా మురికి పారుతూ రోడ్డు మొత్తం నాచు తేలిపోతోంది. దీంతో అటుగా వెళ్తున్న ప్రజలు జారిపడుతూ దెబ్బలు తగిలించు కుంటున్నారు, డ్రైనేజ్ భరించలేని దుర్గంధం దోమలు తదితర కీటకాలతో అనారోగ్యాల పాలవుతున్నారు. పై వీధుల నుండి మురికి ఈ డ్రైనేజీకి లింక్ ఉండడంతో క్లీన్ లేకపోవడం వీధుల్లో ఉన్నవారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం తప్పడం లేదు. సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియ చేసినప్పటికీ కనీసం స్పందించడం లేదంటున్నారు. ఇదే డ్రైనేజీలో త్రాగునీరు పైపు ఉందని మంచినీళ్లు పట్టుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీలో ఉన్న మురికి మట్టి చెత్త తొలగించి స్వచ్ఛతగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకటరమణ, కృష్ణమ్మ, కమలమ్మ, అమ్ముడమ్మ, కొమ్ము సోమశేఖరరావు, కౌశిక్, గందరగోళంవీధి ప్రజలు కోరుతున్నారు.

### జోగినాయుడు

## అర్హతకు తగిన అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జన జీవన స్రవంతిలో మమేకమై.... అందరివాడుగా ఆశీస్సులు, అభినందనలు అందుకుంటున్న సీనియర్ పాత్రికేయ ప్రతిభాశాలి, వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ శాసపు జోగి నాయుడు అని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో ప్రసారభారతి సీనియర్ పాత్రికేయుడిగా ప్రశంసాపత్రాన్ని ఘన సత్కారాన్ని అందుకున్న శాసపు జోగినాయుడు పాత్రికేయుడుగా కాకుండా ఒక సమాజ సేవకుడిగా ఉత్తమ లక్షణాలు కలిగిన ఉన్నత వ్యక్తిగా తమ అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్, జిల్లా న్యాయ సేవా సంస్థ సభ్యులు గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ స్టార్ వాకర్స్‌క్లబ్ ఏర్పాటు చేయడంలో, నడిపించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారన్నారు. రిటైర్డ్ వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కూన వేణుగోపాలరావు మాట్లాడుతూ శాసపు జోగినాయుడు సేవలు అన్ని వర్గాల వారు అందుకుంటారని నేటి తరానికి ముఖ్యంగా గాడి తప్పుతున్న యువతకు సరైన మార్గంలో పెట్టేందుకు పాత్రికేయుడిగా చక్కని వ్యాసాలు.. వార్తలు అందించాలని కోరారు. కార్యక్రమంలో హార్యవల్లి లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, విశ్రాంత పబ్లిక్ రిలేషన్స్ అధికారి విశ్వంభర సాహో, స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు సీనియర్ పాత్రికేయుడు బీవీ రవిశంకర్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, విశ్రాంత మండల రెవెన్యూ అధికారి సూర్యనారాయణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాండురంగారావు, బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు, రాజీవ్, స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు బత్తుల దేవీప్రసాద్, చలపాక సూర్యారావు, డాక్టర్ కె.పాండురంగారావు, గురు ఆనందరావు, పి.నాగేశ్వరరావు, తౌడు, రాధాకృష్ణ, మల్లిబాబు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, వాకర్స్‌సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సందీప్ కొత్త జీవితాన్ని ఇచ్చాడు



2012 తరువాత ఒక్క సినీమా లేక ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ రూపాయి సంపాదన లేని, భార్య సంపాదన మీద ఆధార పడ్డ ధర్మేంద్ర రెండో కొడుకు కు కొత్త జీవితాన్ని ప్రసాదించిన మన తెలుగు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఆయన ఇచ్చిన అవకాశం యానిమల్ చిత్రం అందులో అద్భుతం గా నటించాడు సినిమా సూపర్ హిట్ అయ్యింది బాబీ డియోల్‌కు అవకాశాలు రావడం మొదలయ్యాయి మళ్ళీ పాత వైభవం వస్తోంది. వెంటనే మన తెలుగు వాడే బాబీ కొల్లి ఆయన డాకు మహారాజ్ చిత్రం కూడా హిట్, ఈ సందర్భంగా బాబీతో బాబీడియోల్ కన్నీళ్లు పెట్టుకొని మరీ ఈ విషయం చెప్పేడు మీ తెలుగు డైరెక్టర్ నాకు రెండో జన్మను ప్రసాదించాడు నేను మీ తెలుగు వాళ్ళని అమితంగా ప్రేమిస్తాను అని.. ఇప్పుడు హరిహర వీరమల్లు, హౌస్‌ఫుల్-5 ఆల్ఫా, విజయ్ 69 సినిమాలతో బిజీ అయిపోయాడు. 1995లో బార్సాత్ సినిమాతో ఇండస్ట్రీకి వచ్చిన ఇతను మొదటి నాలుగు సినిమాలు హిట్‌తో నిలదొక్కుకున్నాడు అనుకొనే లోపలే వరస ఫ్లాప్‌లతో అవకాశాలు లేకుండాపోయాయి దాదాపు 13 ఏళ్లపాటు ఒక్క సినిమా కూడా చెయ్యలేదు. మరి సందీప్‌రెడ్డికి ఈయన ఎలా గుర్తుకొని వచ్చేడు ఏమో అతని దశ తిరిగింది.

## రామ్ గోపాల్‌వర్మకి మతి చలించిదా ?



ఆర్జీవీ చెప్పిందేదీ నమ్మబుద్ధి కాదబ్బా, ఆయన రాత్రి చెప్పిన మాట పొద్దున్నే మార్చేస్తుంటాడు ఆ జీవి మాటలు నమ్మితే నట్టేట మునిగినట్లే, వర్మపై ఇండస్ట్రీలో ఉన్న ఒపీనియన్ ఇది. దాన్నిప్పుడు మార్చేయాలని ప్లాన్ చేస్తున్నారు ఇప్పుడు నేను మారిపోయానండీ అంటున్నాడు. మరి ఆర్జీవీ నిజంగానే మారిపోయారా..? నేనింతే.. అంతా నాయిష్టం.. మనల్నెవడ్రా ఆపేది. ఇలాంటి టైటిల్స్ అన్నీ రామ్ గోపాల్ వర్మకు బాగా సూట్ అవుతాయి. ఎవరేం చెప్పినా.. తాను అనుకున్నదే చేస్తుంటారు ఆర్జీవీ. అలాంటి బ్రాండ్ క్రియేట్ చేసారు ఈ దర్శకుడు. అలాంటిదిప్పుడు ఈయనలో మార్పు మొదలైంది,ఇకపై మంచి సినిమాలే చేస్తా,చేయకపోతే చంపేయండి అంటున్నారు. సత్య సినిమా 27 ఏళ్ళ తర్వాత రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా సినిమాను చూసిన వర్మ.. భావోద్వేగానికి గురయ్యారు. కన్నీళ్ళు పెట్టుకుంటూ ట్విట్టర్‌లో పెద్ద లేఖ రాసారు. సత్య, రంగీల తర్వాత తన కళ్లు నెత్తికెక్కాయని.. అంత గొప్ప సినిమాలు తీసిన తాను, ఎంతో చెత్త కూడా తీసానని గుర్తొచ్చి కన్నీళ్లు ఆగట్లేదన్నారు ఆర్జీవీ. ఇకపై గౌరవాన్ని పెంచే సినిమాలు చేస్తానని మాటిచ్చారు వర్మ. బ్రాండ్ న్యూ వర్మను చూస్తారంటూ ప్రమాణం చేసారు. ఒకవేళ అలా చేయకపోతే.. తన తలలో పిస్టల్ గురిపెట్టి షూట్ చేసి చంపేయండంటున్నారు వర్మ. మరి ఈ దర్శకుడిలో వచ్చిన మార్పు నిజమేనా ? నేనింతే అనే వర్మ నేను మారతా అంటే నమ్మొచ్చా అనేది ఆడియన్స్‌లో ఉన్న అనుమానం. ఇకపై ఆయన వైఖరి ఎలా ఉండబోతుందో వెయిట్ అండ్ సీ.. మరి ఇప్పటినుంచి అయినా "నా సినిమా తప్పక చూడండి అంటాడా" ఈ మారిన మనిషి? లేదా ఇంకో ట్వీట్ లో అంతా ట్రాష్ అంటాడా ?

## సీనియర్ నటి స్టన్నింగ్ అవతార్

లేటు వయసులో ఘాటు ఫోజులతో అదరగొడుతోంది సీనియర్ నటి టబు. ఏజ్ లెస్ బ్యూటీగా ఈ భామ ఫీట్స్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఇటీవలే "క్రూ" చిత్రంలో కృతి సనోన్ లాంటి యంగ్ బ్యూటీతో పోటీపడుతూ గ్లామరస్ పాత్రలో నటించిన టబు ఏజ్ నిజానికి 53. అయినా వయసును కనిపించకుండా తన ఛామింగ్ లుక్స్‌తో దాచేస్తోంది ఈ బ్యూటీ. ఇటీవల స్టన్నింగ్ ఫోటోషూట్స్‌తో టబు మ్యాజిక్ చేస్తోంది. నేటితరంతో పోటీపడుతున్న ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లను ఇన్ స్టాలో షేర్ చేస్తూ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా మరో కొత్త ఫోటోషూట్‌తో టబు అభిమానుల ముందుకు వచ్చింది. ఇన్‌స్టాలో టబు షేర్ చేసిన ఫోటోగ్రాఫ్‌లో లాంగ్ ట్రెంచ్ కోట్ ధరించి చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. "కొన్నిసార్లు సండే షాట్స్!" అంటూ ఈ యూనిక్ ఫోటోషూట్‌ని షేర్ చేసింది. టబు ఈ లుక్ లో సింపుల్‌గా ప్రయోగాత్మకంగాను కనిపిస్తోంది. ప్రస్తుతం ఇది యువతరం హృదయాలను గెలుచుకుంటోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవలే 'డ్యూన్ ప్రొఫెసీ' అనే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నన్ పాత్రలో అద్భుతమైన నటనతో టబు ఆకట్టుకుంది. లైఫ్ ఆఫ్ పై సహా పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించిన టబుకు ఇది పెద్ద ఆఫర్. తదుపరి అక్షయ్ కుమార్‌తో కలిసి బూత్ బంగ్లాలో కనిపించనుంది. ప్రియదర్శన్ దర్శకత్వం వహించిన ఈ హారర్-కామెడీ చిత్రం ఇటీవలే షూటింగ్ ని పూర్తి చేసుకుంది. చివరి రోజు తన బృందంతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ దిగి దానిని టబు షేర్ చేయగా వైరల్ గా మారింది. భూల్ భూలైయా విడుదలైన 14 సంవత్సరాల తర్వాత అక్షయ్ కుమార్ -ప్రియదర్శన్ తిరిగి కలిసి వస్తున్నారు. ఇరవై ఏళ్ల తర్వాత అక్షయ్‌తో కలిసి టబు ఈ సినిమాలో నటించింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## చంద్రబాబు ముందుచూపుతోనే ఏపీ అభివృద్ధి

(సత్యంన్యూస్, పలాస)



ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంతో అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి చంద్రబాబు నూతన వెలుగులు తీసుకువస్తున్నారన్నారు. చంద్రబాబుకు చేదోడువాదోడుగా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చంద్రబాబు చాటి చెప్పారు. నేడు మరో మరో ప్రతిష్ఠాత్మకమైన అడుగుపడిందన్నారు. ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారని శిరీష వివరించారు. చంద్రబాబు రాష్ట్రం కోసమే కాకుండా యావత్ దేశం తరపునే దావోస్‌లో నాయకత్వం వహించారన్నారు. ప్రపంచంలోనే అత్యంత తలసరి ఆదాయం గల దేశాల్లో మన దేశాన్ని అగ్రగామిగా నిలపాలని పిలుపునివ్వడంతో పాటు తెలుగువాడి ప్రతిభను మరోసారి పరిచయం చేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి చేతకాని ప్రభుత్వంలా దావోస్ వెళ్ళకుండా ఇంట్లో సమయాన్ని వృదా చేశారన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు విజన్‌పై నమ్మకంతో, రాష్ట్రంలో పెట్టుబడి పెడతానని హామీ ఇవ్వడం చంద్రబాబు విజన్ 2047 విజయాన్ని సూచిస్తోందన్నారు. గతంలో చంద్రబాబు కృషితో రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలను, లక్షల కోట్ల పెట్టుబడులను జగన్ రెడ్డి తరిమేశారని విమర్శించారు. జే ట్యాక్స్ పారిశ్రామికవేత్తలను బెంబేలెత్తించి పారిశ్రామికాభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. కేసుల నుంచి విముక్తి పొందేందుకు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టేందుకు, విశాఖ ఉక్కును అమ్మేందుకు జగన్ ప్రయత్నించారన్నారు. 2019లో వైసీపీ వచ్చాక 'బ్రాండ్ ఏపీ'గా ఉన్న మన రాష్ట్రాన్ని 'బిల్డప్ ఏపీ'గా జగన్ మారిస్తే తిరిగి సన్ రైజ్ ఏపీగా నేడు చంద్రబాబు మార్చటానికి కంకణం కట్టుకున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. ఇప్పటికే అనేక కంపెనీలు తమ కార్యకలాపాలు మొదలుపెట్టాయన్నారు. యువతకు 40 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయన్నారు. జగన్ విధ్వంసక పాలనపై యుద్ధం ప్రకటించిన యువ నాయకులు నారా లోకేష్ రెండు సంవత్సరాల క్రితం ప్రజల, రాష్ట్ర పరిస్థితిలు తెలుసుకోవడానికి యువగళం పేరుతో 97 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపట్టి వాస్తవికతను తెలుసుకున్నారన్నారు.

## లక్ష్మీపురం పాఠశాల విద్యార్థుల సూర్య నమస్కారాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రథసప్తమిని రాష్ట్ర పండగగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన విషయం అందరికీ తెలిసిందే. దానిలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సంతబొమ్మాళి లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యోగాలో డిప్లమా తీసుకున్న రెడ్డి సూరిబాబు మాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు సాధన చేశారు. ఈ సందర్భంగా సూర్యనమస్కారాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.



# విఓఏల సమస్యలు పరిష్కరించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వెలుగు విఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వెలుగు విఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.ప్రభావతి, జి.అసిరినాయుడు అన్నారు. విఓఏల 7 నెలలు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ ఎపి వెలుగు విఓఏల ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ (మహాత్మా జ్యోతిభాపూలే పార్కు) వద్ద సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు విఓఏలు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా ఉన్నారని అన్నారు. అనేక రకాల పనులు చేయించుకుంటున్నా విఓఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 7 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే విఓఏలు తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకోగలరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విఓఏల మెడపై కత్తిలా ఉన్న 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ తక్షణమే రద్దుచేసి విఓఏల ఉపాధిని కాపాడాలని కోరారు. రాష్ట్రంలో 28వేల మంది విఓఏలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు కోసం, ఉద్యోగ భద్రతకోసం, హెచ్ఆర్ పాలసీ అమలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, జండర్ పేరుతో తొలగింపులు ఆపాలని తదితర డిమాండ్ల సాధనకై విఓఏలు ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీక్షలకు సిఐటియు జిల్లా నాయకులు అల్లు.సత్యన్నారాయణ, కె.సురయ్య, ఆర్.ప్రకాష్, వికెఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు త్రినాధరావు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలలో సంఘం నాయకులు డి.జోగారావు, జి.యర్రయ్య, వై.అనురాధ, కె.మన్మధరావు, లక్ష్మి, ఎన్.రాజేశ్వరి, నర్తు.మహాలక్ష్మి, పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షలు మూడు రోజులు కొనసాగుతాయి.

## బాలయ్యకు పద్మభూషణ్ పట్ల హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించడం పట్ల శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలయ్య & మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షుడు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. తండ్రి ఎన్టీఆర్ పద్మశ్రీ ద్వారా నందమూరి వంశాన్ని ఇనుమడింపజేస్తే నేడు బాలకృష్ణ పద్మభూషణ్ ద్వారా ఆ ప్రతిష్టను ఖండాంతరాలకు వ్యాపింజేశారన్నారు. అనంతరం స్థానిక సూర్య మహల్ జంక్షన్ వద్ద ఘనంగా బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురకాశి వెంకటరావు, కూన రామారావు, లొట్టి సూరిబాబు, ఎన్టీఆర్ ఎంఎస్ఎస్ అధ్యక్షులు దేవిడ్ మాదారపు, సురేంద్ర, సురేష్, భాస్కర్, దుర్గ, మోహన్, రాజు, ప్రసాద్, బాసిరెడ్డి, మహేష్, వెంకీ, జనార్ధన్, గణేష్, సతీష్, దిలీప్, గోపాల్, సూర్య మహల్ థియేటర్ నాగభూషణంరావు, రిప్రజెంట్ తేజ తదితరులు పాల్గొన్నారు







రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని స్థానిక శ్రీకాకుళం కాస్మోపాలిటన్‌క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని కార్యదర్శి సురంగి మోహనరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కృష్ణమోహన్, కోశాధికారి జి.సత్యంనాయుడు, సభ్యులు జె.గిరిధర్, ఆర్.అప్పలనాయుడు, వీవీఆర్ఎస్ మూర్తి, బి.నర్సింహమూర్తి, ఎస్.అప్పారావు, వై.ఉమామహేశ్వరరావు, బీసీహెచ్ అప్పారావు, జి.గోవిందరావు, కె.చిట్టిబాబులు పాల్గొన్నారు.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## విద్యుత్ చార్జీల పెంపుదల సరికాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇప్పటికే, పెరుగుతున్న ధరలు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకంపై విద్యుత్ చార్జీల పెంపుదల రూపంలో అదనపు భారం మోపడం సరికాదని' శ్రీకాకుళం టేక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, మణికొండ ఆదినారాయణమూర్తి తెలియజేశారు. విద్యుత్‌పై భారాలు వ్యతిరేకిస్తూ వినియోగదారుల నుండి సేకరించిన సంతకాల పేపర్లు సోమవారం కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో 2004 నుండి వాడిన విద్యుత్ కోసం కట్టిన బిల్లు మొత్తం సరిపోలేదంటూ, అదనంగా సర్దుబాటు చార్జీల రూపంలో మరల కట్టాలంటూ భారం వేయడం సమర్ధనీయం కాదన్నారు. దీంతోపాటు వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అమర్చి, వాటి ఖరీదు కోసం వారి నుండి వేలాది రూపాయలు వసూలు చేయడం మరో భారమన్నారు. దీనికి కొనసాగింపుగా, ప్రీపెయిడ్ విధానంకు మారి ముందుగానే డబ్బులు చెల్లించి కరెంటు వాడుకోవాలని చెబుతున్నారన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇచ్చే ప్రారంభంలోనే వినియోగదారుడు నుండి వసూలు చేసిన వేలాది రూపాయలు డిపాజిట్ రూపంలో సంస్థ వద్ద ఉందన్న విషయం మరిచిపోకూడదన్నారు. అంటే ప్రీ పెయిడ్ విధానం ఇప్పటికే అమల్లో ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. మరల కట్టమనడం అర్ధరహితమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ లను వ్యతిరేకించిన నేటి పాలకులు ఇప్పుడు స్మార్ట్‌మీటర్ బిగింపునకు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. 'టైమ్ ఆఫ్ డే టారిఫ్' (కరెంటు ఎక్కువగా వాడే గంటలలో అధిక చార్జీ వసూలు చేయడం) మరో భారమని, దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు.




# రథసప్తమిని వైభవంగా నిర్వహించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష నారాయణ అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో సూర్యనమస్కారాలను జిల్లా అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేసి స్ఫూర్తిగా నిలిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలిసారి రాష్ట్ర పండుగగా గుర్తింపు తెచ్చుకున్న రథసప్తమి వేడుకలను మూడు రోజుల పాటు ఘనంగా జరిపి మూడు తరాలు గుర్తు పెట్టుకునే విధంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ నిర్వహించే రథసప్తమి వేడుకల్లో చిక్కోలు ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కలికితురాయిగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. రథసప్తమికి ముందుగా సూర్యనమస్కారాలు చేసిన జిల్లా అధికారులు అభినందనలు తెలిపారు. రథసప్తమి రోజుల్లో సుమారు ఐదువేల మందితో 80 అడుగుల రోడ్డులో రికార్డు స్థాయిలో సూర్యనమస్కార కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సూర్యనమస్కారాలు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. సూర్యుడి కిరణాల్లో డి విటమిన్ ఉంటుందని ఇది మనసును ఎంతో ప్రశాంతంగా ఉండేలా చేస్తుందన్నారు. శరీరాన్ని చురుగ్గా మారుస్తుందని రక్తప్రసరణను మెరుగుపరుస్తుందని వివరించారు. కండరాల, కీళ్ల నొప్పులను తగ్గిస్తుందని శ్వాస సంబంధిత సమస్యలను తగ్గిస్తుందని స్పష్టం చేశారు. చెడు కొవ్వు తగ్గేలా చేసి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు. ఉదయాన్నే సూర్యుని నేరుగా చూడడం కళ్ల ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుందని తెలిపారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుందనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, అయితే యోగాలో సూర్య నమస్కారాలు చాలా కీలకమని వివరించారు. సూర్య నమస్కారాలు లేకుండా.. యోగా పూర్తైతుందని మనం చెప్పలేమన్నారు. సూర్య నమస్కార్ ఒక శక్తివంతమైన యోగా భంగిమ అని పేర్కొన్నారు. ఇది శరీరం, మనస్సుపై సానుకూల ప్రభావాన్ని చూపుతూ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. సూర్య నమస్కార్ అనేది పూర్తి శరీర వ్యాయామాన్ని అందించే 12 శక్తివంతమైన యోగా భంగిమల సమితి అని వివరించారు. అందుకే సూర్యనమస్కారం మొత్తం 12 భంగిమలను నేర్చుకోవడం మన మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడుకోవడానికి చాలా అవసరం అని ఎమ్మెల్యే అన్నారు. ప్రణమాసనం, హస్త ఉత్తనాసనం, హస్త బదాసన, అశ్వ సంచలనాసన, చతురంగ దండసనం, అశ్వ సంచలనాసన, అష్టాంగ నమస్కారం, భుజంగాసనం, అథోముఖ స్వనాసన, అశ్వ సంచలనాసన, హస్త బదాసన, హస్త ఉత్తనాసన, ప్రణమాసనం వంటి భంగిమలు దీర్ఘకాల ఆరోగ్యాన్ని అందజేస్తుందన్నారు. అన్ని సూర్య నమస్కారాలతో కండరాల బలం, ఓర్పు, వశ్యతను మెరుగుపరుస్తాయని, సూర్య నమస్కారాన్ని క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీరానికి బలం చేకూరుతుందని చెప్పారు. సూర్య నమస్కారం మీ నాడీ వ్యవస్థను మంచి ఆరోగ్యంగా ఉంచుతుందని, ఇది మీ శరీరం రోగనిరోధక శక్తిని పెంచడానికి, ఇన్ఫెక్షన్ లేదా వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుందని వివరించారు. ఇది డిప్రెషన్, యాంగ్జయిటీ , ఇతర తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యల నుండి మీకు ఉపశమనం కలిగించడంలో సహాయపడుతుందని, మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని, మంచి నిద్రను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జెసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇతర జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్‌లో గణతంత్రదినోత్సవ వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక గూనపాలెంలో గల శాంతినికేతన్ విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల డైరెక్టర్‌లు సురంగి మోహనరావు, కొర్ను ప్రతాప్, కొర్ను పావనిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మంచిగా మెలిగి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఆనందరావు, కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సద్గురు త్యాగరాజస్వామి ద్వితీయ ఆరాధన మహోత్సవం

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డోలు సన్నాయి, బ్యాండ్ పార్టీ కళాకారుల ఆధ్వర్యంలో పట్టణంలో ఆదర్శ పురుషుడైన శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు రాజాం టీటీడీ కళ్యాణ మండపంలో ఉదయం 6.30 గంటల నుండి రాజాం నవదుర్గ మాత ఆలయం నుండి త్యాగరాజ స్వామి చిత్రపటం ఊరేగింపు, శేక్సాఫోన్ కచేరీ నిర్వహిస్తామన్నారు. దొంతకుర్తి త్రినాథరావు మాస్టారు దంపతులకు చిరు సత్కారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్యకుమార్, పసుపురెడ్డి వెంకటరమణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, కొండేటి దుర్గారావు సెక్రటరీ, కమిటీ సభ్యులు సొనాయిల తవిటయ్య, సుందరపల్లి రాజేష్, ఎం అప్పలసూరి, తాతపూడి సూర్యనారాయణ, గణేష్ చేతుల మీదుగా విడుదల చేసారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## గ్రంథాలయాధికారి శ్రీనివాసరావుకు పురస్కారం



(సత్యంన్యూస్, లావేరు)

శ్రీకాకుళం జిల్లా ఉత్తమ గ్రంథాలయాధికారి అవార్డు గ్రహీత, లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావుకు విశిష్ట భారత్ శిక్షహార్ పురస్కారం-2025 లభించింది. విద్య, సామాజిక సేవా రంగంలో 38 ఏళ్లుగా విశిష్టమైన సేవలందించినందుకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్నోకి చెందిన పీఎంజీ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని శ్రీనివాసరావుకు ప్రకటించింది. ఫౌండేషన్ అధ్యక్షులు ఆనంద్ సింగ్ వర్చువల్ విధానంలో ఆదివారం ఈ పురస్కారాన్ని అందించారు. ఈయనకు పురస్కారం లభించడం పట్ల పలువురు అధికారులు, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు, స్నేహితులు, అభిమానులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

## ‘స్థానిక’ నిధుల వినియోగంలో రాజకీయ ఒత్తిడిలు తగదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టెక్కలి నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలోని మండల పరిషత్ నిధులు, మండలాలకు జిల్లాపరిషత్ నుంచి కేటాయించిన నిధులు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన 15వ ఎఫ్ఏసీ నిధుల వినియోగంలో రాజకీయ ఒత్తిడితో అధికారుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. ఈమేరకు జెడ్పీ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి అందజేశారు. అంతకు ముందు పోలీసులు అనుమతించకపోవడంతో జెడ్పీ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మండల పరిషత్ నిధుల వినియోగానికి సంబంధించి సభ్యులు ఆమోదించిన పనులు చేపట్టేందుకు సంబంధిత ఎంపీడీవో లు, ఇంజినీరింగ్ అధికారులు సహకరించడంలేదని ఫిర్యాదు చేశారు. పరిపాలన అనుమతులు గాని, ఎంబుక్ రికార్డింగ్ గాని చేయడంలేదని, అలాగే జిల్లా పరిషత్ నుంచి జెడ్పీటీసీ సభ్యుల ప్రతి పాదన మేరకు మంజూరైన పనులు చేసేందుకు అధికారులు ఎస్టి మేట్‌లు తయారుచేయడం లేదని, గ్రామ పంచాయతీల్లోని 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులతో పంచాయతీ సర్పంచ్‌ల తీర్మానం మేరకు పనులు చేపడుతున్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎంబుక్‌లు రికార్డింగ్ చేయకుండా రాజకీయ ఒత్తిడిలతో పనులు అడ్డుకొని బిల్లులు పెట్టడంలేదన్నారు. టెక్కలి నియోజకవర్గంలో అధికారులు స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ ప్రజాప్రతినిధులను అగౌరవపరుస్తున్నారని, దీనిపై స్పందించి పనులు జరిగేలా అధికారులకు ఆదేశించాలని, స్థానిక సంస్థల ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. ఆయనతో పాటు జెడ్పీటీసీలు దువ్వాడ వాణి, పేరాడ



భార్గవి, సింహాచలం, ఎంపీపీలు మల్లేశ్వరరావు, నడుపూరి శ్రీరామమూర్తి, టెక్కలి నియోజకవర్గ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ నంది పురస్కారానికి
## అప్పలరాజు ఎంపిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పెద్దపాడు గ్రామానికి చెందిన జోగ అప్పలరాజు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నంది పురస్కారాలకు ఎంపికైనట్లు ఆ సంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఫిబ్రవరి 2న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. భజన కళాకారులు, యూట్యూబ్ ఫేమస్ గాయకుడిగా విశిష్ట సేవలందించిన జోగ అప్పలరాజు జాతీయ స్థాయిలో నంది పురస్కారానికి ఎంపికవడం పట్ల జిల్లాకు చెందిన పలువురు హర్షం తెలిపారు.






## ధాన్యం కొనడానికి ‘గింజ’కుంటున్నారు

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం వెలువరిస్తుందో అని రైతులు ఎదురు చూస్తున్నారు.

**మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**

**- గ్రీవెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వినతి -**

జిల్లాలో ధాన్యం కొనుగోలు టార్గెట్ పెంచి రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, కె.మోహనరావు కోరారు. ఈమేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిని అందించారు. జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి అనుకూలించి ధాన్యం దిగుబడి పెరిగిందని, దానికి అనుగుణంగా 7 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలనీ అధికారులు అంచనాలు వేసినప్పటికీ ప్రభుత్వం 4.90 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించివేసిందని, ఫలితంగా రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లకు బీజీలు లేవని, టార్గెట్ అయిపోయిందని తిప్పిపంపుతున్నారని, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ట్రాక్‌సీట్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించిన పలాస, మందస తదితర మండలాల్లో దళారీలు తెచ్చిన ధాన్యానికి అర్థరాత్రి ట్రాక్‌సీట్లు ఇస్తున్నారని, దీనిపై పరిశీలించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు.



## సౌమ్యకు వీరగాథ 4.0లో స్టేట్‌ఫస్ట్

(సత్యంన్యూస్, పలాస)

మందస మండలం కుంటికోట కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న బరాటం సౌమ్యకు వీరగాథ 4.0 ఫర్ ఆన్‌లైన్ పోటీలో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించింది. రాష్ట్ర సమగ్రశిక్ష నిర్వహించిన ఈ పోటీల్లో పదో తరగతి చదువుతున్న కాశీబుగ్గకు చెందిన బరాటం సౌమ్య మల్టీమీడియాలో వీరవనిత ఝాన్సీలక్ష్మీభాయి సాహసగాథను 2024 అక్టోబర్‌లో అప్‌లోడ్ చేసి మేథావుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు ఈ డాక్యుమెంటరీనే జనవరి 26 సందర్భంగా ప్రథమ బహుమతిని గెలుచుకుందని ప్రకటించారు. ఇందులో భాగంగా విజయవాడ సమగ్రశిక్ష కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. చిన్నప్పటి నుంచి చదువులో టాపర్‌గా నిలిచిన సౌమ్య ఇప్పుడు సామాజిక అంశాల్లో కూడా మెరవడం ఆనందదాయకమని కళింగకోమటి నేతలు హర్షం వ్యక్తం చేశారు.



## కాలువలు లేని సిమెంట్ రోడ్లు ఎందుకు?

✔ స్థానికుల ఆవేదన! ✔ ఎమ్మెల్యే, సర్పంచ్‌లు చొరవ రూపాలని విజ్ఞప్తి!

సత్యంన్యూస్, శ్రీకాకుళం

ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు రోడ్లు, కాలువలు వేసి ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు అన్ని పనులు చేయమని అధికార, ప్రజాప్రతినిధులకు అప్పగించింది. ఇందులో భాగంగా చాలా రోడ్లు మరమ్మతులతో పాటు కొత్తగా తారు రోడ్లు వేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నారు. అలాగే గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలతో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేయాలని పంచాయతీలకు నిధులను కూడా సమకూర్చిన విషయం తెల్సిందే. అయితే శ్రీకాకుళం రూరల్ పరిధి సింగుపురం, ప్రశాంతనగర్ కాలనీ, తదితర పంచాయతీ పరిధి గ్రామీణ ప్రాంత వీధుల్లో మురుగు కాలువలు లేకుండా కేవలం రోడ్లు మాత్రమే వేస్తున్నట్లు సర్వేలు చేయించారు. దీనివలన ఇప్పటికే గృహాల వాడుక మురుగునీరు కాలువ లేక ఎటువైపు వెళ్లక రోడ్డు మీదకు, అలాగే పొరుగున వున్న ఇంటి స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో అందరికీ ఇబ్బందికరంగా ఉంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలతో పాటు, ఇరుగుపొరుగు వారితో తీవ్ర తగాదాలు రోజూ ఎదుర్కొంటున్నామని స్థానికులు అంటున్నారు. తమకు రోడ్డు అవసరమే కానీ రోడ్డుతో పాటు మురుగునీరు వెళ్లేందుకు కాలువలు కూడా అవసరమని స్థానికులు వాపోతున్నారు. వాడుక నీరు, మురుగునీటిని పంపేందుకు కాలువలు లేని రోడ్లు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ముందుగా రోడ్లు వేసి, తర్వాత ఎప్పుడైనా కాలువలు వేస్తామని అంటున్నారు. అలా చేస్తే వాడుక, మురుగు నీరు ఎటూ వెళ్లలేక తిరిగి రోడ్లపైకి ప్రవహిస్తాయని, దీనివల్ల సిమెంట్ రోడ్లు పూర్తిగా పాడయిపోతాయని, అందుకే ముందుగా కాలువలు వేసి, తర్వాత రోడ్లు కూడా వేస్తే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, సర్పంచ్ ఆదిత్యనాయుడు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది అర్థం చేసుకొని సమస్యను తీర్చేందుకు ముందుగా కాలువతో పాటు సిమెంట్ రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



## 26 ఏళ్లుగా నిరంతరాయంగా..

- ❖ తుపానులో సైతం ధనుర్మాస మేలుకొలుపులు
- ❖ సంక్రాంతి నాడు ఘనంగా ఏకాహం
- ❖ ఏకాదశి నాడు 1500 మందికి అన్నదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొన్నవీధి భీమేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో ధనుర్మాస మేలుకొలుపులు మొన్నటితో 26 ఏళ్లు పూర్తిచేసుకున్నాయి. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ధనుర్మాసంలో నగర సంకీర్తన నిర్వహించారు. తుపాను, చలికి జనం వణికినా వెరవక భీమేశ్వర భజన బృంద సభ్యులు మేలుకొలుపులతో నగర సంకీర్తన చేశారు. ఈ 26 ఏళ్లలో ఎటువంటి ఆటంకాలు లేకుండా కరోనా సమయంలో కూడా తమ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగిందని, అందుకు భీమేశ్వరుని కరుణా కటాక్షాలే కారణమని భజన బృంద ప్రతినిధులు బలగ మన్మధరావు, సొంగలి గణేష్, గార సూర్యనారాయణ, శ్యామ్ తెలిపారు. కాగా ఈ ఏడు కూడా సంక్రాంతి నాడు ఏకాహం భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించామని, ఇందుకు సహకరించిన భజన బృందాలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రతీ ఏడాదిలానే ధనుర్మాస మేలుకొలుపులు, సంక్రాంతి నాడు ఏకాహం అనంతరం శనివారం భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇందులో 1500 మంది పైబడి భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి భీమేశ్వర భజన బృంద సభ్యులతో పాటు స్థానికులు, చుట్టుపక్కల ప్రజలు సహకరించారని వారికి మాజీ కౌన్సిలర్ బలగ పండరీనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.







## రైతులను కూటమి దగా చేసింది

రాష్ట్ర కళింగ కార్పోషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు మాస్టారు)



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతాంగాన్ని దగా చేసిందని కళింగ కార్పోరేషన్ పూర్వ చైర్మన్, వైకాపా కళింగ సంక్షేమవర్గ రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు(లక్ష్మణరావు మాస్టారు) ఆరోపించారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఖరీఫ్‌లో తుపాను వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేసిందని దుయ్యబట్టారు. వైకాపా హయాంలో నష్టపోయిన రైతులకు నెలల వ్యవధిలోనే పరిహారం చెల్లించవారన్నారు. రైతులకు రైతుభరోసా కింద రూ.20 వేలు ఇస్తామని 9 నెలలు గడిచినా ఇవ్వాలేదన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం చర్యలు వల్ల రైతులకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొంటామని ప్రకటించిన నాయకులు ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. వంశధార, నాగావళి అనుసంధానం చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. జిల్లాలో సాగునీటి కాల్వల మరమ్మతు చేయకపోవడం వల్లనే ఆయకట్టు శివారు ప్రాంతాలకు నీరందక పంటల దిగుబడి తగ్గిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 9 నెలల పాలనలోనే ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. ఇప్పటికైనా రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.